అడుగడుగునా గోతులే..

• అధ్వానంగా గ్రామీణ రహదారులు • ఇబ్బందులు పడుతున్న ప్రజలు • పట్టించుకోని పాలకులు, అధికారులు

ఎన్నికల వేళ అభివృద్ధే లక్ష్యమని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రహదారుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు భారీ గుంతలమయమై ప్రయాణం నరకప్రాయంగా మారింది.



గుంతలమయమైన సంగం-పల్లిపాళెం రహదారి

సంగం: మండలంలోని కోలగట్ల, కొరిమెర్ల, తరుణవాయి, తలుపూరుపాడు, చెన్నవరప్పాడు, సంగం–పల్లిపాళెం ప్రాంతాలకు వెళ్లే గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అడుగుకో గుంత చొప్పున దర్శనమిస్తున్నాయి. సంగం నుంచి పల్లిపాళెం మీదుగా గాంధీ జనసంఘం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న రహదారి పూర్తిగా శిథిలమైంది. అడుగడుగునా గుంతలమయంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే ఒళ్లు, వాహనాలు గుల్ల అవుతున్నాయి. అదేవిధంగా నెల్లూరు- ముంబై జాతీయ రహదారి నుంచి కోలగట్ల క్రాస్‌రోడ్డు నుంచి గ్రామంలోకి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రహదారి పూర్తిగా కుంగిపోయి అధ్వానంగా తయారైంది. దీనిపై అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

ఈ రహదారిపై ప్రయాణం చేస్తున్న గ్రామస్తులు ప్రతినిత్యం నరకాన్ని చూస్తున్నారు. అదే విధంగా కలిగిరి రహదారి నుంచి ఎడమవైపు కొరిమెర్ల గ్రామానికి, కుడివైపు తలుపూరుపాడు గ్రామానికి వెళ్లేందుకు వేసిన రహదారులు, ఏఎస్ కండ్రిక నుంచి తరుణవాయి, చెన్నవరప్పాడు, పడమటిపాళెం గ్రామాలకు వెళ్లే గ్రామీణ రోడ్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది.

పట్టించుకోని పాలకులు

అభివృద్ధి, సంక్షేమం అని గొప్పలు చెబుతున్న కూటమి పాలకులు అధ్వానంగా ఉన్న రహదారులపై కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో రహదారులను అద్దంలా చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన పాలకులు నేడు రోడ్ల పేరిట భారీగా బిల్లులు చేసి దోచుకుంటున్నారే తప్పా గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లపై దృష్టి సారించకపోవడం దారుణం.

ఆనం ఇలాకాలో ఇదీ దుస్థితి

రహదారుల అభివృద్ధికి రూ.కోట్లాది నిధులు మంజూరయ్యాయని చెప్పుకుంటున్న పాలకులు వాటిని ఎక్కడ ఖర్చు పెట్టారో వారికే ఎరుక. అధ్వానంగా, శిథిలమైన రహదారులపై తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదని గ్రామీణులు కూటమి ప్రభుత్వానికి శాపాలు పెడుతున్నారు. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఇలాకాలో గ్రామీణ ప్రాంతాల రహదారులు ఇలా ఉండడం సిగ్గుచేటు అని నియోజకవర్గ ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన కోలగట్ల రహదారి



రాళ్లు తేలి దుర్భర స్థితిలో ఉన్న చెన్నవరప్పాడు రహదారి

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక



దొంతు రత్నయ్య

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు ఎస్సీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొంతు రత్నయ్య జిల్లా ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో ఆయనకు మండల విద్యాశాఖ అధికారులు తిరుపతయ్య, ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వేళాంగణి ఉత్సవాలు



సీతారామపురం: స్థానిక అరుంధతీయవాడలో వేళాంగణి మాత నవదిన ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు వేళాంగణి మాత స్వరూపాన్ని కాలనీలో ఊరేగించారు. అనంతరం విచారణ గురువు అజయ్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని 11 అంగన్‌వాడీ కార్యకర్తలు, 12 సహాయకుల పోస్టులకు సంబంధించి ఈనెల 10, 11వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ పద్మజా కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వింజమూరు, కలిగిరి, జలదంకి మండలాలకు సంబంధించి ఈనెల 10న 9 గంటలకు కావలి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో, కొండాపురం మండలానికి సంబంధించి ఈనెల 11వ తేదీ కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతున్నందున దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పక హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

నేత్రదానంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

అల్లూరు: నేత్రదానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అల్లూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆప్తమాలజిస్ట్ శార్వాణి తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఒకరి నేత్రదానం ఇద్దరికి చూపునిస్తుందన్నారు. అనంతరం నేత్రదానం చేయదలచిన వారి నుంచి సమ్మతి పత్రంపై వివరాలను నమోదు చేయాలని సూచించారు.

పొగాకు సాగుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



నారుమడులను పరిశీలించి మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి

మర్రిపాడు: 2025–26 పంట కాలానికి సంబంధించి ఎఫ్‌సీవీ పొగాకు సాగు వేసే రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, బోర్డు అనుమతి లేకుండా నారుమడి సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ స్పష్టం చేశారు. ఆయన డీసీపల్లిలోని ఎఫ్‌సీవీ పొగాకు నారుమళ్లను గురువారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వాణిజ్య సరళిలో నారుమడి పెంచే రైతులు గరిష్టంగా రెండు హెక్టర్ల వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, నారుమడి ఆవరణలో రైతుపేరు, విస్తీర్ణం, రకానికి సంబంధించి ఫ్లెక్సీ బోర్డు పెట్టాలన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం

ఉదయగిరి రూరల్: మండలంలోని బిజ్జంపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి హెచ్‌ఎం ఒ.మాధవరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, ఉపాధ్యాయులు సాయిబాబు, రోషన్‌తాజ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం



ఆత్మకూరు: పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న హజ్రత్ అన్సర్ షావలి బాబా దర్గాలో గంధ మహోత్సవం గురువారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందురోజు అర్ధరాత్రి సొందల్ మాలితో గంధాన్ని దంచి నూతన పాత్రలో ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకొచ్చి గంధ లేపనం చేశారు. అనంతరం సమాధిపై నూతన వస్త్రాన్ని, పూల చద్దర్లను పరిచారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దర్గా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గోడౌన్ నిర్మాణానికి స్థల పరిశీలన

సీతారామపురం: మండలంలోని మారంరెడ్డిపల్లి పీఏసీఎస్ కార్యాలయ ప్రాంగణంలో గోడౌన్‌తో పాటు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి గురువారం సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ సహకార సంఘాల ప్రత్యేక డీఈ నారాయణరెడ్డితో కలిసి స్థల పరిశీలన చేశారు. సొసైటీ అభివృద్ధికి షాపింగ్ కాంప్లెక్స్ ఆదాయ వనరులు చేకూర్చేలా దోహదపడుతుందన్నారు. ఈ మేరకు రెండు భవనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. వారి ఆదేశానుసారం పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సంకతాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రీవెన్స్‌డే రేపు

ఉదయగిరి: మండలంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 6వ తేదీన ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రత్యేక గ్రీవెన్స్‌డే కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ ఎల్.రామ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ఉదయగిరి: మాట్లాడుతున్న ఏపీఎం స్రవంతి

అనుమసముద్రంపేట : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తే సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని స్త్రీనిధి ఏజీఎం హేమంత్‌కుమార్ తెలిపారు. ఏఎస్‌పేట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్త్రీనిధిపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి రికవరీ చేసిన మొత్తం డబ్బులను ఫోన్‌పే ద్వారా చెల్లించే అవకాశం ఉందని, ప్రస్తుతం ప్రభుత్వ యాప్‌పై అవగాహన కలిగి ఉంటే బ్యాంకుల వరకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. స్త్రీనిధిని ఎలా ఉపయోగించాలి, ఎలా రికవరీ చేయాలనే అంశాలపై ఆయన మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కామాక్షయ్య, ఏపీఎం సతీష్, మహిళలు పాల్గొన్నారు.



అనుమసముద్రంపేట: మాట్లాడుతున్న ఏజీఎం హేమంత్‌కుమార్

లోకోస్ యాప్‌పై అవగాహన

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో లోకోస్ యాప్‌పై గురువారం ఏపీఎం స్రవంతి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు లోకోస్ యాప్ ద్వారా జరపాలన్నారు. రుణాల రికవరీ శాతాన్ని నూరు శాతం సాధించాలన్నారు. సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

76 మందికి వైద్య పరీక్షలు

ఉదయగిరి రూరల్: మండలంలోని జి.చెరువుపల్లిలో మండల వైద్యాధికారిణి వినీత గురువారం 104 వాహన వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దీర్ఘకాలిక రోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తరగతి గదుల ప్రారంభం

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణంలో నాబార్డు నిధులు రూ.1.18 కోట్లతో నిర్మించిన తరగతి గదులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువులను గౌరవించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీసీ వెంకటసుబ్బయ్య, తహసీల్దార్ ఎల్.రామ్మోహన్, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఎంపీడీఓ అప్పాజీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లల బాధ్యత నాదే

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రత్యేకావసరాల పిల్లల బాధ్యతను తానే చూసుకుంటానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రత్యేకావసరాలు గల వారికి ఉపకరణాలు అందించేందుకు మెడికల్ క్యాంప్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 352 మంది పిల్లలకు అవసరమైన ఉపకరణాలతో పాటు వారి చదువు బాధ్యత కూడా తానే తీసుకుంటానని ప్రకటించారు. విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం, డీఈఓ బాలాజీ, జెడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, ఎంఈఓ పి.రమేష్, స్థానిక నేతలు నరసారెడ్డి, జూపల్లి రాజారావు, గువ్వల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

ఆత్మకూరు: నివాసాలతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని ఆత్మకూరు యూపీహెచ్‌సీ సిబ్బంది అన్నారు. పట్టణంలోని ఉత్తర బలిజవీధి పరిసర ప్రాంతాల్లో గురువారం వారు ఇంటింటికీ తిరిగి నిలువ నీటిని పారబోసి బ్లీచింగ్ చల్లడం, అధికంగా నీరు నిల్వ ఉన్న ఆయిల్ చల్లడం లాంటి పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి జ్వరాలు, అంటు రోగాలు సంక్రమించాయా అనే వివరాలు సేకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ ఎస్.సుధాకర్, ఎంపీహెచ్‌ఏ రవీంద్రారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



బ్లీచింగ్ చల్లుతున్న ఆరోగ్య సిబ్బంది

గురుపూజోత్సవం నేడు

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు గురుపూజోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ అనంతలక్ష్మి గురువారం తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన పది మంది ఎస్‌జీటీ, ఐదుగురు ఎస్‌ఏలను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశామని, వారిని సన్మానించనున్నట్లు వివరించారు.

హెచ్‌ఐవీపై అవగాహన



ఆత్మకూరు: పట్టణంలోని మెప్మా కార్యాలయంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ సంస్థ సీడబ్ల్యూఓ శశికళ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం హెచ్‌ఐవీ బాధితులకు ఉచితంగా మందులు అందజేస్తుందని, డివిజన్ కేంద్రాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో ఇవి లభ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఓ మాధవి, చైల్డ్ ఫండ్ సంస్థ సభ్యులు పి.ప్రమీల, జి.వసంత, రమాదేవి, పొదుపు మహిళలు, సంఘ బంధాల సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల సమాఖ్య జిల్లా కార్యదర్శిగా వెంకటరమణయ్య



వెంకటరమణయ్య

సంగం: మండలంలోని జేబీకేఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భీమతాటి వెంకటరమణయ్యను జిల్లా పాఠశాలల సమాఖ్య కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి ఓ ప్రకటనలో వెలువడింది.

తాగునీరందక ఇక్కట్లు



ఆవేదన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

వింజమూరు(ఉదయగిరి) : మండలంలోని ఏ.కిస్తీపురం పంచాయతీ చింతలపాళెంలో బీసీ కాలనీవాసులు కొన్ని రోజులుగా తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఏడు తాగునీటి బోర్లు ఉన్నప్పటికీ నీటి లభ్యత లేకపోవడంతో నీరు సక్రమంగా రాక కాలనీ వాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామంలో గత కొన్ని నెలలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేదలకు భూములు కేటాయించాలి



మాట్లాడుతున్న లక్ష్మీపతి

దుత్తలూరు: అర్హులైన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం భూముల కేటాయింపు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గంటా లక్ష్మీపతి డిమాండ్ చేశారు. దుత్తలూరులో వ్యవసాయ కార్మిక సంఘ నాలుగో మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 300 ఎకరాల భూములు పెత్తందారుల చేతుల్లో ఉన్నాయన్నారు. వాటిని అర్హులైన పేదలకు అందజేయాలన్నారు. మండలంలోని చింతలగుంట, నందిపాడు గ్రామాల్లో వందల ఎకరాల భూముల్లో ఆక్రమణలు జరిగాయన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం 13 మందితో నూతన కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నేలటూరి సింహాద్రి, గుజ్జుల మల్లికార్జున, మదులూరి లీల, నల్లబోతుల సుప్రజ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ఉదయగిరి రూరల్ : రికార్డులు పరిశీలిస్తున్న చేస్తున్న ఎంపీడీఓ



సీతారామపురం: సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ సాయిప్రసాద్

ఉదయగిరి రూరల్: మండలంలోని సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ అప్పాజీ అన్నారు. ఆయన పట్టణంలోని బిట్–2 సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు తదితర రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సచివాలయంపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. సమయపాలన పాటిస్తూ, బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కేటాయించిన లక్ష్యాలు సాధించాలన్నారు.

• **సీతారామపురం:** సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ సాయిప్రసాద్ హెచ్చరించారు. ఆయన సీతారామపురం బిట్–2 సచివాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. వినతుల నమోదుకు ప్రత్యేక రిజిస్టర్‌ను ఏర్పాటు చేసి పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం రిజిస్టర్లు పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. ఈఓపీఆర్డీ రామనాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల వద్ద ట్రాక్టర్ల నిలిపివేత



అప్పారావుపాళెం ఇసుక రీచ్ ఎదుట నిలిపివేసిన ట్రాక్టర్లు

ఆత్మకూరు : మండలంలోని అప్పారావుపాళెం పెన్నానది రీచ్ వద్ద అనుమతుల్లేకున్నా యథేచ్ఛగా ఇసుక రవాణా సాగుతోంది. టీడీపీ నాయకుల ప్రోత్సాహంతో అక్కడ ఓ కుటుంబం ట్రాక్టర్‌కు రూ.50 చొప్పున వసూలు చేస్తూ రీచ్‌లోకి పంపుతారు. ఈ క్రమంలో ఆ కుటుంబానికి సమీప బంధువులతో ఇటీవల గొడవలు చోటుచేసుకుంది. ట్రాక్టర్ల వద్ద వసూళ్లు చేయడం నిలిపివేయాలని లేదా తాము వసూలు చేస్తామని వాదులాడుకోవడంతో గురువారం ఇసుక రీచ్‌లోకి ట్రాక్టర్లు వెళ్లకుండా నిలిపివేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇలా ట్రాక్టర్లను వెళ్లకుండా నిలిపివేయడంతో కొన్ని ట్రాక్టర్లు మధ్యాహ్నం వెనుతిరగ్గా, మరికొన్ని సాయంత్రం వెనుతిరిగాయి. ఇరు కుటుంబాల వారు టీడీపీకి సానుభూతిపరులే అయినా దండకాల్లో తేడాలు రావడంతో ఇలా వాహనాలను నిలిపివేయడం ఏమిటని ట్రాక్టర్ ఓనర్లు, డ్రైవర్లు విసుక్కున్నారు. ఈ విషయమై కొందరు ఎస్సై జిలానీకి సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసులను పంపారు. గొడవకు ముందే రీచ్‌లోకి వెళ్లి ఉన్న ట్రాక్టర్లు లోడ్ చేసుకొని ఉండడంతో పోలీసులు వాటిని అన్‌లోడ్ చేయించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రీచ్‌లో ఇసుక తవ్వకాలు జరపరాదని పోలీసులు గ్రామస్తులకు తెలిపారు. కుటుంబాల మధ్య గొడవతో నిరాటంకంగా సాగుతున్న ఇసుక అక్రమ తరలింపులకు బ్రేక్ పడడంతో పలువురు ట్రాక్టర్ ఓనర్లు ఇదెక్కడి విచిత్రమంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.